**కథ**

# మార్పు

## "మీ వరస నాకేం నచ్చటం లేదు"

**అన్యాపదేశంగా ఆమె అన్న మాట ఎవరినుద్దేశించిందో తెలీక పేపరు చదువుతున్న కమలాకరం, సాయం కాలం వంటకి బియ్యం ఏరుతున్న పార్వతి ఒక్కసారే తలెత్తి చూశారు.**

''ఈడొచ్చిన పిల్లకి పెళ్లిమాటలు తలపెట్ట కుండా చదువుల పేరు చెప్పి బలాదూరుగా తిరగనిస్తున్నారు''

నిష్టూరంగా మనసులో మాట బయట పెట్టింది లక్ష్మీదేవమ్మ.

'అమ్మయ్య' గుండెల మీద చెయ్యేసు కుంది పార్వతి. అత్తగారికి తనేమేనా లోపం చేసిందేమో, తన వరస నచ్చటం లేదంటోందని భయపడింది. అది కాదని తేలిపోవడంతోటే తేలి కగా నిట్టూర్చింది.

నిజానికి అత్తగారంటే పార్వతికెంతో గౌరవం. పదమూడేళ్ల పిల్లగా ఉన్నప్పుడు ఈ ఇంట్లో అడుగు పెట్టింది. అత్తిల్లంటే ఎలాగుంటుందో భర్తంటే ఏమిటో సరియైన అవగాహన లేని వయ స్సులో ఆ ఇంట్లో అడుగు పెట్టింది.

తల్లి, అమ్మమ్మ, ఇరుగుపొరుగు ముత్తయిదు వులు తనకి చెప్పిన జాగ్రత్తలు, చేసిన హెచ్చరికలు భయాన్నే కలిగించాయి.

కానీ నెల రోజులుండేసరికి తన భయాలు, అనుమానాలు అన్నీ పటాపంచలయ్యాయి.

నిజంగా లక్ష్మీదేవమ్మ మనసు వెన్నపూస. తనని తన కూతుళ్లతో పాటే సమానంగా చూసు కుంది. ఇంకా వాళ్లకన్నా తనని ఒక పాలు ఎక్కువ గానే చూసుకుందంటే అతిశయోక్తి కాదేమో.

ఆడపడుచులు తమ అధారిటీని అప్పుడ ప్పుడు తన మీద చూపబోతే ''ఏమర్రా.. చిన్నపి ల్లని చేసి దాని మీద అధారిటీ చెలాయిస్తున్నారా! అందరిని వదులుకొని అది మనింటికొచ్చింది. వదినంటే తల్లి తరవాత తల్లి అంతటిది. నా తరు వాత అదే మీకు పెట్టినా పోసినా'' ఇలా ఉండేవి లక్ష్మీదేవమ్మ మాటలు.

చిక్కులు తీసి జడవేసేది. పెరట్లో పూలన్నీ ఏరి తెచ్చి దండగుచ్చి తలలో పెట్టేది. కొసరి కొసరి తినిపించేది.

తన పట్ల అత్తగారు చూపించే ఆదరణకి అప్పుడప్పుడు ఆడపడుచులు ఉడుక్కునేవారు.

అత్తగారి ఆప్యాయతను తలచుకుంటే మనసు ఇప్పటికి ఆనందంతో పొంగిపోతుంది. ఇద్దరు బిడ్డల తల్లయి తనప్పుడే నలభయ్యవ పడిలో పడుతున్నా నాటికి నేటికి అత్తగారిలో మార్పు లేదు. అదే ఆప్యాయత, అదే ఆదరణ.

కోడలు ఆలోచనల్లో పడిపోవడం చూసి ''ఏమే పార్వతీ నా మాటెలాగా వాడికి లక్ష్యం లేదు. నువ్వయినా చెప్పరాదూ పిల్లకి పెళ్లి చేయ మని''

పార్వతి సమాధానం చెప్పేలోగానే చదువు తున్న పేపరు పక్కన పెడుతూ-''ఏమిటమ్మా.. దానికిప్పుడేమంత వయస్సు మించిపోయిందని! ఇంకా పదహారేగా''

అన్నాడు కమలాకరం తల్లి ముఖంలోకి చూస్తూ.

''ఉహూ.. పదహారే.. మరి నీ పెళ్లాం ఎన్నేళ్ల వయసులో వచ్చిందేమిటి ఈ ఇంటికి? నీ చెల్లెళ్లు ఎన్నేళ్లకెళ్లారు అత్తింటికి?''

''ఆ రోజులు వేరమ్మా. ఇప్పుడు ఆడపిల్ల లైనా మగపిల్లలైనా ఎవరి కాళ్ల మీద వాళ్లు నిలబడగ లిగే శక్తి వాళ్లకి మనమియ్యాలి. చదువు వల్లే వాళ్లకి ఆత్మవిశ్వాసం దొరుకుతుంది. రోజులు బాగా లేవు. తెల్లవారి లేచి పేపర్లో ఎన్ని వార్తలు చూడటం లేదూ''

''అవునత్తయ్యా అందరికీ మీలాంటి అత్త గారే దొరుకుతుందా''

''భేష్.. ఇంకేం తాన అంటే తందాన. మొగుడు పెళ్లాలిద్దరిది ఒకటే మాట. మధ్యలో నేనెవర్ని మీ పిల్లల గురించి చెప్పడానికి''

చేస్తున్న వత్తుల పని అయిపోయినట్టు అవన్నీ డబ్బాలో సర్ది అక్కడి నుంచి లేచిపోయింది లక్ష్మీ దేవమ్మ.

''అమ్మకి కోపం వచ్చినట్టుంది'' పార్వతి ముఖంలోకి చూశాడు కమలాకరం.

అత్తగారి కోపం ఎంతసేపులెండి అన్నట్లు అర్థ వంతంగా నవ్వి తను చేట పట్టుకొని లోనికి వెళ్లి పోయింది పార్వతి.

**వి. సత్యవతీదేవి**

★ ★ ★

అప్పుడే ఫలహారం కానిచ్చి వరండాలో మంచం వాల్చుకొని విసనకర్ర ఒకటి చేత్తో పట్టు కొని మంచం మీద కూర్చుంది లక్ష్మీదేవమ్మ. అసలే మండు వేసవి. అధికారకోత కొంత అనధి కార కోత కొంతతో కరెంటు ఇక్కట్లు.. ఉక్క పోత భరించలేక కరెంటు మీద కన్నా విసనకర్ర మీదే నమ్మకం పెట్టుకొని ఉండి ఉడిగి విసరు కుంటూ ఏదో అష్టపది పైకి వినిపించి వినిపించ నట్లు పాడుకొంటోంది.

కమలాకరం ఒక్కడే కొడుకు, ఇంటికి పెద్ద వాడు, తరువాత ఇద్దరు కూతుళ్లు, భర్త ఉండ గానే ఒక కూతురికి కొడుక్కి పెళ్లిళ్లు అయిపో యాయి. చిన్నకూతురు లక్ష్మి పెళ్లి మాత్రం తండ్రి పోయిన ఏడాది లోపే అయితే కన్యాదాన ఫలం దక్కుతుందని తల్లి పోరితే ఉన్నంతలో మంచి సంబంధమే చూసి చేశాడు పెద్దకొడుకుగా తన బాధ్యత చక్కగా నిర్వర్తిస్తూ. అందరి సంసారాలు బాగానే ఉన్నాయని, వచ్చిన కోడలు, అల్లుళ్లు అందరి మంచితనాన్ని తల చుకొని మురిసిపోతూ ఉంటుంది లక్ష్మీదే వమ్మ.

★ ★ ★

అప్పుడే ఆఫీసు నుంచి వచ్చిన కమలాకరం లోపలకి వెళ్లి బట్టలు మార్చుకొని భార్య ఇచ్చిన టీ కప్పు అందుకొని తల్లి దగ్గరకొచ్చి కూర్చు న్నాడు.

''అదేమిటిరా ఏడయిపోయింది. ఇప్పుడు టీ తాగితే భోజనం ఎప్పుడు చేస్తావురా. ఎప్పుడో పది గంటలకి తిన్న మెతుకులు''


''ఫరవాలేదమ్మా. కొంచెం తలనొప్పిగా ఉంటేను. ఇంకో రెండు గంటలాగి తింటాలే. ఇంకా ఏడే కదా అయింది'' అంటూ ''అమ్మా.. ఇవాళ లక్ష్మి దగ్గర నుంచి ఉత్తరం వచ్చిందే బావ గారు రాశారు''

''ఏమిటీ.. లక్ష్మి దగ్గర నుంచి ఉత్తరం వచ్చిందా? మరి ఇంతవరకు చెప్పవేమిరా. ఏం రాసిందేమిటి అంతా బాగున్నారా'' అంటూ ఆత్రంగా అడిగింది లక్ష్మీదేవమ్మ.

ఉత్తరం మాట భర్త నోటమ్మట విని వంటిం టిలో ఉన్న పార్వతి కూడా బయటకొచ్చింది.

''ఆ..ఆ.. అంతా బాగున్నారటమ్మా. లక్ష్మికి నిన్ను చూడాలని ఉందట. అమ్మని ఒక మారు పంపించు పది రోజులు ఉంచుకొని పంపిస్తానని రాసింది''

కొడుకు మాటలకి నిట్టూరుస్తూ.. ''అవు నురా నాక్కూడా దాన్ని చూడాలని చాలా రోజుల బట్టి అనిపిస్తూ ఉంది. రెండేళ్ల కిందట దాని కూతురి పెళ్లికి అందరం కలిసి వెళ్లాం. అంతే.. మళ్లీ దాన్ని చూడేలేదు''



''అదేంటండీ.. లక్ష్మినే ఒకమారు ఇక్కడకు రమ్మని రాయచ్చు కదా. అందిరినీ చూస్తుంది'' అంది పార్వతి అత్తగారి మాటలకడ్డొస్తూ.

''అదెక్కడ వస్తుంది లేమ్మా.. గంపెడంత సంసారం. అత్తగారు మామగారు ఇద్దరు ముసలాళ్లయిపోయారు. చదువుకొంటున్న ఇద్దరు మరుదులు. పిల్లలు..ఎవరికప్పచెప్పి వస్తుంది. అది జరిగే పని కాదు కానీ ఒరేయ్ కమలా నన్ను రేపు రైలెక్కించి బావకి ఫోను కొట్టరా. స్టేషనుకొచ్చి తీసుకెళతాడు'' అంది లక్ష్మీదేవమ్మ.

''సరేలే. ఎల్లుండి శనివారం నాకు ఆఫ్..ఆ రోజు వెళుదువుగానీలే'' అని స్నానానికి లేచాడు కమలాకరం.

★ ★ ★

స్టేషనులో బండి ఆగగానే కిటికీలోంచి ఆత్రుతగా ఎదురుచూస్తున్న లక్ష్మీదేవమ్మకి అల్లుడు భాస్కరం త్వరత్వరగా అడుగులేసుకుంటూ తన పెట్టె వైపే రావడం గమనించి ద్వారం దగ్గరకొచ్చి ''అల్లుడుగారూ ఇక్కడ.. ఇక్కడ'' అంటూ దగ్గరకొచ్చిన అల్లుడికి సూట్‌కేస్ అందించి మెల్లగా బండి దిగింది.

గుమ్మంలో రిక్షా ఆగగానే తన కోసమే ఎదురు చూస్తున్న కూతురు కనిపించగానే లక్ష్మీదేవమ్మ కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ''అమ్మా బాగున్నావా'' అంటూ ఆప్యాయంగా పలుకరిస్తున్న కూతుర్ని వాటేసుకొని కూతురి వెనక ఎవరో నుంచుని తన వైపే చూస్తున్నట్టనిపించి అటు చూసింది.

''అదేమిటే లక్ష్మి అది మన ప్రమీల కదూ. ఇదెప్పుడొచ్చిందే'' అంటూ కూతుర్ని వదలి మనవరాలి దగ్గరకొచ్చి ''ఇదేమిటే ప్రమీలా ఇలా అయిపోయావు. ముద్దబంతి పువ్వులా ఉండేదానివి ఇలా చిక్కి శల్యమయి పోయావేమిటే తల్లీ. అసలు పోలిక పట్టేట్టు ఉన్నావుటే'' అంటూ చెయ్యి పట్టుకొని దగ్గరకు లాక్కొంది.

''అమ్మా.. తర్వాత తాపీగా మాట్లాడుకుందాం లోపలికి రా'' అంటూ లోపలకి దారి తీసింది లక్ష్మి.

భోజనాలయ్యాయి. తల్లికి పెరటి వరండాలో మంచం వాల్చి తలగడ పెట్టి తల్లి పడుకుంటే పక్కనే కూర్చుంది లక్ష్మి. ప్రమీలా కాస్త దూరంలో కూర్చొని భోజనం చేసిన గిన్నెలు కడుగుతూ ఉంది.

''ప్రమీల ఎప్పుడొచ్చిందే. దాని కాపురం ఎలాగుంది? దాని పెళ్లికి రావడమే మళ్లీదాన్ని చూడేలేదు. ఏమిటి అలా చిక్కిపోయింది'' అంటూ ఇందాకల నుంచి మనస్సులో దొలుస్తూన్న ప్రశ్నల పరంపరని విడుదల చేసింది.

''అమ్మా.. ప్రమీల కాపురం గురించి ఏం చెప్పమంటావ్. మంచి సంబంధం, మంచి సంబంధం అని తెగ సంబరపడిపోయాం అందరం. కానీ వాళ్లు డబ్బు మనుషులమ్మా. ఒక సంవత్సరం సజావుగానే సాగింది దాని సంసారం. ఇప్పుడు దానిలోని లోపాలన్నీ వాళ్లు భూతద్దం లోంచి చూస్తున్నారు. ఆనాడు నాలుగు చదివి ఆపేసిందండి అంటే పర్వాలేదండీ ఇంట్లో వంటా వార్పుకే కదా అనేశారు. ఇప్పుడేమో చదువులేని పల్లెటూరు మొద్దని వెక్కిరిస్తున్నారట. చదువుకొన్న అమ్మాయి ఐతే ఎంత చక్కగా ఉద్యోగం చేసి డబ్బులు వేలకి వేలు సంపాదించేదట. ఇచ్చిన లక్ష కట్నం ఇప్పుడు వాళ్ల కళ్లకి ఆనటం లేదు. గడచిన ఆరు నెలల్లో రెండు పర్యాయాలు ఇక్కడికి తరిమేశాడు. స్కూటరుకి డబ్బులు తే అని, ఏదో ఆఫీసు డబ్బులు వాడేసి ఇబ్బందుల్లో పడ్డాడని ఒకమారు ఏభై వేలు, ఒకమారు నలభై వేలు ఇచ్చి పంపించాం. ఇప్పుడు మళ్లీ నెలయింది వచ్చి. ఏదో ఫ్లాట్ అమ్మకానికొచ్చిందట. మూడు లక్షలు తెమ్మని తరిమాడు. మేం అంత ఆస్తిపరులం కాము. నాన్న ఎక్కడి నుంచి తెచ్చి ఇస్తాడు లక్షలకి లక్షలు అని ఇది వెళ్లనని మొరాయిస్తే వారం రోజుల పాటు తిండి పెట్టక, అత్తా మొగుడు కలసి ఒళ్లు చితకపొడుస్తే ఇంక భరించలేక వాళ్లతో చెప్పకుండా రైలెక్కి వచ్చే



సిందట.

మేం ఫోన్ చేసి ఏం నాయనా అంటే 'అది వెళ్లిపోయింది. మాకు పీడ విరగడయింది. తెస్తే మూాడు లక్షలు పట్టుకొని రమ్మనండి. లేదా మా అబ్బాయికి చక్కటి చదువుకొన్నది, మంచి ఉద్యోగస్తురాలిని బోలెడు కట్నంతో తెచ్చుకుంటాం' అన్నారుట తల్లీ కొడుకులిద్దరు. మీ అల్లుడే స్వయంగా వెళ్లి మాట్లాడతానంటే...ఛస్తే, నేనా గుమ్మం తొక్కను. మీరూ వెళ్లొద్దు. నన్ను బలవంతం చేశారా నేను ఉరిపోసుకు చస్తా. అంటోంది'' లక్ష్మి కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

''అదేమిటే అంత పాపిష్టి వెధవలు. బంగారం లాంటి అమ్మాయి, లక్ష రూపాయల కట్నం, లాంఛనాలతో వస్తే వాళ్లకి చాలింది కాదా. వాడేం పెద్ద కలెక్టరా. చేసేది బోడి గుమస్తాగిరే కదా'' లక్ష్మిదేవమ్మ అక్కసు వెళ్లబుచ్చింది.

''ఇప్పుడు మీ అల్లుడు చాలా విచారిస్తున్నారమ్మా. ప్రభుత్వం పద్దెనిమిది ఏళ్లొస్తేనేగానీ పెళ్లిళ్లు చేయొద్దని ఆడపిల్లల్ని కూడా చదివించాలని ఎంత గోలపెడుతున్నా మనం చెవిని పెట్టలేదని. హాయిగా దాన్ని ఏ డిగ్రీ వరకో చదివిస్తే ఎంత బాగుండును. దాని కాళ్లమీద అది నిలబడి దాని జీవితాన్ని చక్కదిద్దుకోగలిగే శక్తి దానికుండును. లోకం తెలియని వయస్సులోనే పెళ్లి చేసేసేం. దాన్ని జీవితాన్ని మనమే పాడుచేశాం అంటూ ఆఫీసులో ఉన్నంత సేపు ఏమోకానీ ఇంట్లో ఉన్నంతసేపు ఒకటే దిగులుతో బాధపడుతున్నారమ్మా. ఇటు పిల్ల జీవితం ఇలా అయిందనే బాధ పడాలా.. అటు భర్త దిగులుతో తిండి కూడా సరిగా తినడం లేదని బాధపడాలా..'' లక్ష్మి చెంగుతో కళ్లు తుడుచుకుంది.

కూతురి మనోవేదననర్థం చేసుకున్న లక్ష్మిదేవమ్మకి మనసు కలతపడింది. ప్రమీల జీవితం నాశనం కావడానికి తాను కూడా ఒక కారణమే. అది పదకొండేళ్లకి రజస్వల అయింది మొదలు అల్లుణ్ని, కూతుర్ని పిల్లకి పెళ్లి చేసెయ్యమని తెగ నస పెట్టింది. దానికి తన వియ్యపురాలు వియ్యంకుడు కూడా వంతపాడేరు.

అల్లుడికి మనసులో ఏముందో కానీ పైకి వ్యతిరేకత చూపించలేదు. ఇక అమ్మాయియితే ఎప్పుడు దాని అభిప్రాయం పైకి చెప్పలేదు. భర్త, అత్తమామలు ఎంతంటే అంతే. ఇప్పుడు పిల్ల జీవితం ఇలా అవడానికి బాధ్యులెవరు? తామంతా..

లక్ష్మిదేవమ్మ ఆలోచనల పరిధి పెరుగుతున్న కొద్దీ కొడుకు జ్ఞాపకమొచ్చాడు. అవును వాడు చేస్తున్న పని సరైనదే. ఆడపిల్లలని ముఖ్యంగా చదివించాలి. పెద్ద పెద్ద చదువులు.. దుర్మార్గుడైన భర్త పీచమడిచేటట్టు వాళ్ల ఆత్మ విశ్వాసం పెంచుకోవాలి.

లక్ష్మిదేవమ్మ వారం రోజులున్నాక కొడుకు దగ్గరకి ప్రయాణం కట్టింది. వెళ్లే ముందు అల్లుడితో అందరి ముందూ ''నాయనా భాస్కరం ప్రమీలని మళ్లీ చదివించు. పెద్ద చదువు చదివించు. మంచి ఉద్యోగం వచ్చేటట్టు చూడు. అశ్రద్ధ చేయకు'' అంటూ మరీ మరీ చెప్పింది.

తల్లిమాటలు వింటూ లక్ష్మి.. అత్తగారి మాటలు వింటూ భాస్కరం.. ఈమె మా అమ్మేనా.. మా అత్తేనా అంటూ నిశ్చేష్టులయిపోయి నిలుచుండిపోయారిద్దరూ.

☆

## రూమర్లంటే భలే క్రేజ్!

**నయనతారకి రూమర్లంటే భలే ఇష్టంట. యువ హీరో శింబుతో తన ప్రేమాయణం గురించిన వార్తలు ఎక్కడ అచ్చయినా వాటిని ఎంచక్కా జాగ్రత్తగా కత్తిరించి దాచుకుంటోందిట నయనతార. ఎన్ని రూమర్లు ఇలా వస్తుంటే అంత పాపులారిటీ తనకి ఫ్రీగా వస్తుందనేది ఆమె ఆలోచన అని ఆమె సన్నిహితుల ఉవాచ. కానీ శింబుతో ఎఫైర్ గురించి మాత్రం ఆమె నోరు మెదపడం లేదు. ఇదో రకం టెక్నిక్!**